క్లుప్తంగా

ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా ఎన్నిక


నాగేంద్రకుమార్

కడప ఎడ్యుకేషన్‌: కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో జంతు శాస్త్ర విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ వీర నాగేంద్ర కుమార్ ఇండియన్ జులాజికల్ వెల్ఫేర్ సొసైటీ,లక్నోకు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా ఎన్నికయ్యారు. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీ, ఇన్‌స్టిట్యూషన్ నుంచి మొత్తం 16 మంది ఎన్నికయ్యారు. వీర నాగేంద్ర కుమార్ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో డయాబెటిస్, ఆల్జీమర్ వ్యాధులకు సంబంధించిన ఉత్తమ పరిశోధక వ్యాసాలను ప్రచురించారు. ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, అకాడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటసుబ్బయ్య, డాక్టర్ నాగరాజు, డాక్టర్ నాగేశ్వర రెడ్డి, డాక్టర్ మహేష్, డాక్టర్ సతీష్‌రెడ్డి, డాక్టర్ సీలయ్య, డాక్టర్ రవిశేఖర్, విద్యార్థులు నాగేంద్రకుమార్‌ను అభినందించారు.

డిప్యూటీ తహసీల్దార్ శివారెడ్డిని సస్పెండ్ చేయాలి

కడప కార్పొరేషన్‌: కడప మండలం తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న డిప్యూటీ తహసీల్దార్ శివారెడ్డిని సస్పెండ్ చేయాలని దళిత నాయకుడు మేకల దేవ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నగరంలోని రామాంజనేయపురంలో ఉన్న జగనన్న కాలనీ సర్వే నంబర్లు 404, 406లో టిడ్కో- 2 లో అనేక ప్లాట్లను డబ్బులు తీసుకొని ఆన్‌లైన్ చేశారన్నారు. దీనివల్ల నిజమైన లబ్ధిదారులకు, పేదలకు అన్యాయం జరిగిందన్నారు. దీనిపై తాను రెవెన్యూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని అన్నారు. శనివారం రెవెన్యూ కోర్టుకు హాజరై జరిగిన అవినీతి అక్రమాల గురించి ఆర్‌డీఓకు తెలిపానన్నారు. ఆర్‌డీఓ డీటీని పిలిపించి మందలించారన్నారు. ఆర్డీఓ కార్యాలయం నుంచి బయటకు వచ్చిన తనను డీటీ శివారెడ్డి రెవెన్యూ కోర్టులో కేసు వాపసు తీసుకోకపోతే నీ అంతు చూస్తానని, నీపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపిస్తానని బెదిరించాడని ఆరోపించారు. శివారెడ్డి వల్ల తనకు ప్రాణహాని ఉంది.దళితుడినైన నన్ను బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్న శివారెడ్డిపై చట్ట పరమైన చర్యలు తీసుకోని కేసు నమోదు చేసి న్యాయం చేయాలని కోరారు.

కార్మికోద్యమ యోధుడు ఇబ్రహీం ఖాన్

కడప సెవెన్‌రోడ్స్‌: మూడున్నర శతాబ్దాలుగా బ్యాంకు ఉద్యోగిగా, అధికారిగా ఉద్యోగుల హక్కుల కోసం పోరాడిన కార్మిక ఉద్యమ యోధుడు ఇబ్రహీంఖాన్ అని విశ్రాంత బ్యాంకు అధికారులు వీరారెడ్డి, జానమద్ది విజయభాస్కర్ తెలిపారు.ఈనెల 5వ తేది అనారోగ్య కారణంగా మరణించిన ఇబ్రహీంఖాన్ సంస్మరణ సభ ఆదివారం కడపలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ గ్రామీణ బ్యాంకులో ఉద్యోగిగా చేరి యూనియన్ నాయకుడిగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలంటూ ఎన్నో ఉద్యమాలు నడిపారన్నారు. ఇబ్రహీం ఖాన్ ఎందరో బాధిత ఉద్యోగులుగా రుణాలు ఇప్పించి వారి హక్కులకై నిరంతరం శ్రమించారని యూనియన్ నాయకులు పద్మాకర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంఖాన్ సోదరుడు, ఏపీజీబీ విశ్రాంత అధికారి హయాత్‌ఖాన్, కేఎల్‌ఎన్ కుమార్, హనుమేష్‌రావు, ఉమామహేశ్వరరావు, గౌతమ్, వీరారెడ్డి, సాయినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దారుణం

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు గుంటి నాగేంద్ర



మాట్లాడుతున్న గుంటి నాగేంద్ర, నాగార్జునరెడ్డి

కడప కార్పొరేషన్‌: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడం దారుణమని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు గుంటి నాగేంద్ర, వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పీపీపీ విధానంతో ప్రజల సొమ్మును ప్రణాళికబద్ధంగా లూటీ చేస్తూ పేద వర్గాలకు వైద్య విద్యను దూరం చేసే సీఎం చంద్రబాబు విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 25 సంవత్సరాలపాటు అధికారం, 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు హయాంలో పేద వర్గాలకు జరిగిన మేలు ఏమి లేదన్నారు. చంద్రబాబు హయాంలో ఒక్క మెడికల్ కళాశాల తీసుకురాలేదన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ పేద వర్గాలు అనారోగ్యంతో బాధపడకూడదని భావించి ఆరోగ్యశ్రీ అమలు చేసి కొన్ని లక్షల కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేస్తూ పేద వర్గాలు వైద్య విద్యను అందుబాటులోకి తెస్తూ 17 మెడికల్ కాలేజీలకు అనుమతులు తీసుకొచ్చి వాటిని ఏర్పాటు చేయడానికి సంకల్పించారన్నారు.రూ. 8450 కోట్లతో చేపట్టిన 17 మెడికల్ కళాశాలల్లో మొదటి దశలో ఐదు మెడికల్ కాలేజీలు పూర్తయ్యాయన్నారు. ఎన్నికల ముందు మరో మూడు కాలేజీలు పూర్తయ్యాయన్నారు. ఏ ఒక్క కళాశాలను తీసుకురాలేని చంద్రబాబు వాటిని ఎలా ప్రైవేటు పరం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ చరిత్ర హీనుడిగా మిగిలిపోతున్నారన్నారు. ఎంసీఐ పులివెందులకు 50 మెడికల్ సీట్లను కేటాయిస్తే, వాటిని వద్దని కేంద్రానికి లేఖ రాసిన నీచ చరిత్ర చంద్రబాబుదన్నారు.

ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సాయిదత్త, నగర అధ్యక్షుడు శివారెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి జమీల్, వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి అర్జున్ రావు పాల్గొన్నారు.

శ్రీ విజయదుర్గమ్మకు విశేష పూజలు



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ, కలశాలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

కడప సెవెన్‌రోడ్స్‌: నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున పుణ్యానది జలాలతో నింపిన తొమ్మిది పవిత్ర కలశాలతో అభిషేకం నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ఉభయదారులు పవిత్ర కలశాలు చేతబూని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. ఆ జలాలతో అమ్మవారికి నవకలశ స్నపనం చేశారు. అనంతరం ఆలయ యాగమండపంలో భక్తులతో చండీహోమం చేయించారు. చంద్ర గ్రహణం కావడంతో సాయంత్రం నిర్వహించాల్సిన పల్లకీ సేవ, దీపాల సేవ రద్దు చేశారు. సాయంత్రం నుంచి ఆలయం మూసి ఉంచారు. సోమవారం ఆలయ శుద్ధి అనంతరం ఉదయం 8 గంటలకు అమ్మవారి దర్శనం ఉంటుందని ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్‌లు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పట్టని ప్రభుత్వం

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా


మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

కడప ఎడ్యుకేషన్‌: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా పేర్కొన్నారు. ఆదివారం కడపలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయ కుమార్ అధ్యక్షతన జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మిరాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తవుతున్నా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి సారించకపోవడం తగదన్నారు. ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలు ఇస్తామని, బకాయిలను రోడ్ మ్యాప్ ప్రకటించి ఏడాదిలోగా చెల్లిస్తామని కూటమి పెద్దలు చెప్పారని, వాటి గురించి మరచిపోన్నారు. 2023 జూలై మాసం నుంచి వేతన సవరణ చేపట్టి 12వ పీఆర్‌సీని అమలు చేయాల్సి ఉన్నప్పటికీ పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు.ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 వేల కోట్ల రూపాయల బకాయిలను చెల్లించాల్సి ఉన్నప్పటికీ కేవలం రూ.7500 కోట్లు మాత్రమే చెల్లించారన్నారు.కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీన పరచడమే ధ్యేయంగా పనిచేస్తోందని అన్నారు.సమావేశంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ట్రెజరర్ బి.రాజశేఖర్ రాహుల్, యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు డి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు కె.చెన్నయ్య, సి.వి.రమణ, చెరుకూరి శ్రీనివాసులు, ఎస్.ఎజాస్ అహ్మద్, టి.శివప్రసాద్, లక్ష్మి ప్రసన్న, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.క్రిష్టారెడ్డి, సీపీఎస్ జిల్లా కన్వీనర్ సి.సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో పాల్గొన్న ఏపీపీటీడీ అవుట్ సోర్సింగ్ అసోసియేషన్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్‌: ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఏపీపీటీడీ అవుట్ సోర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గంగాంజనేయులు కోరారు.

ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ కార్మికులకు యాజమాన్యం నిర్ణయించిన జీతాలు ప్రకారం కార్మికులకు కాంట్రాక్టర్లు ఇవ్వడం లేదన్నారు. అంతేకాకుండా ఇచ్చే వేతనాల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు నేషనల్ సెలవులు, పండుగ సెలవులు వర్తింపజేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర సెక్రటరీ రాజారెడ్డి, ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా చీఫ్ వైస్ ప్రెసిడెంట్ ఓబుల్ రత్నం, అనంతపురం డిపో ప్రెసిడెంట్ ఎస్ఆర్ ఖాన్, సీపీఐ జిల్లా నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అసమానతలు లేని సమాజం కోసం పోరాడుదాం


మాట్లాడుతున్న డాక్టర్ సుబ్రహ్మణ్యం

కడప రూరల్‌: అసమానతలు లేని సమాజం కోసం పోరాడుదాం అని వక్తలు తెలిపారు. ఆదివారం స్థానిక బీసీ భవన్ లో బామ్ సేఫ్ 19వ రాష్ట్ర మహాసభలు జరిగాయి ఈ కార్యక్రమానికి హాజరైన వైద్యులు వీవీ సుబ్రమణ్యం, రాముడు మాట్లాడుతూ మహాత్ములైన బుద్ధుడు, మహాత్మాజ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, పెరియార్ తదితరులు ఆదర్శనీయులని తెలిపారు. ఆ మహనీయుల స్ఫూర్తితో అసమానతలు లేని సమాజం కోసం పోరాడాలన్నారు. కొన్ని పార్టీలు కులాల మధ్య చిచ్చు పెట్టి లబ్ధి పొందాలని చూస్తున్నాయన్నారు. ఆ విధానాలకు మేధావులు అడ్డుకట్ట వేయాలన్నారు. డాక్టర్ మదన్‌మోహన్ మాట్లాడుతూ జంతువులకు ఇచ్చే విలువ మనుషులకు ఇవ్వకపోవడం దారుణం అని అన్నారు. డాక్టర్ క్రాంతి మాట్లాడుతూ దేశంలో సాంఘిక అసమానతలు ఉన్నాయని, బహుజనులు వాస్తవాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో విద్యావంతులు కావడం వల్ల సమాజం చైతన్యవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో సంపత్ కుమార్, ఓబులేష్, డాక్టర్ నిరంజన్, డాక్టర్ నాగన్న పెద్ద సంఖ్యలో ప్రముఖులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలి


మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ

కడప ఎడ్యుకేషన్‌: ఉద్యోగ, ఉపాధ్యాయులకు 2023 జూలై నుంచి అమలు కావాల్సిన 12వ పీఆర్‌సీ కమిటీని వెంటనే నియమించాలని ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం కడపలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఆర్‌సీ కమిటీ ఇంతవరకు నియమించకపోవడం వల్ల రాష్ట్రంలోని ఉద్యోగులంతా రెండు సంవత్సరాల పీఆర్‌సీ కాలాన్ని నష్టపోయారని వారు వాపోయారు. రాష్ట్ర కార్యదర్శి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కాంప్లెక్స్ స్థానాల్లో పనిచేస్తున్న గణిత, ఆంగ్ల ఉపాధ్యాయులకు శాశ్వత స్థానాలు కేటాయించే ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, బాలకష్టుడు తదితరులు పాల్గొన్నారు.

బలిజలకు అన్యాయం చేస్తున్న కూటమి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్

కడప కార్పొరేషన్‌: రాష్ట్రంలో ఉన్న బలిజ, తెలగ, ఒంటరి కులాలకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివ ప్రసాద్ అన్నారు. ఆదివారం మాజీ డిప్యూటీ సీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరులతో ఆయన మాట్లాడారు. బలిజలకు టీడీపీ ఏదో ఒరగబెట్టినట్లు ఆ పార్టీలో ఉన్న కొందరు నాయకులు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. బండి బాబు మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయన్నారు. అంతకు ముందు టీడీపీలో ఉన్న బండిబాబు వైఎస్సార్‌సీపీలోకి వస్తే కో ఆప్షన్ పదవి ఇచ్చి గౌరవించడం జరిగిందన్నారు. ఆయన వల్లే ఆకులవీధిలో బలిజలు కార్పొరేటర్ టికెట్ కోల్పోయారన్నారు. మొన్నటి వరకూ హరిప్రసాద్‌కు భజన చేసి, ఇప్పుడు శ్రీనివాసులరెడ్డి పంచన చేరారన్నారు. బండిబాబును ఒక వెన్నుపోటు దారుడిగా బలిజలు భావిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు జిల్లాలో సుమారు 20 మంది బలిజ నాయకులకు పదవులు వచ్చాయని తెలిపారు. కడపలో ఆర్భాటంగా పెట్టిన మహానాడుకు ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, సుగవాసి బాలసుబ్రమణ్యం ఎందుకు రాలేదో సమాధానం చెప్పాలన్నారు.బలిజలను వాడుకొని కరివేపాకులా తీసివేయడం టీడీపీకే చెల్లిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సుదర్శన్, రెడ్డి ప్రసాద్, సాయిదత్త, రామక్రిష్ణ, మల్లికార్జున కిరణ్, పత్తిరాజేశ్వరి, ఉమామహేశ్వరి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

గంజాయి బ్యాచ్, మందుబాబుల ఘర్షణ

కడప అర్బన్‌: కడపలోని చలమారెడ్డిపల్లె శివారు ప్రాంతంలో ఆదివారం గంజాయి సేవించిన రవీంద్రనగర్‌కు చెందిన 11 మంది యువకులకు, చలమారెడ్డిపల్లెకు చెందిన ముగ్గురు యువకులకు మధ్య ఘర్షణ జరిగింది. విశ్వసనీయ సమాచారం మేరకు కడప నగరం రవీంద్రనగర్, తదితర ప్రాంతాలకు చెందిన 11 మంది యువకులు ఆదివారం తమ మోటార్ సైకిళ్లలో శివారు ప్రాంతంలో గంజాయి ప్యాకెట్లను తీసుకున్నారు.. చలమారెడ్డిపల్లె శివారు ప్రాంతానికి వెళ్లారు. కొండకు సమీపంలో గంజాయిని సేవించి మత్తులో తూలారు. తరువాత కడప నగరానికి వస్తున్న సమయంలో అదే ప్రాంతానికి దగ్గరగా చలమారెడ్డిపల్లెకు చెందిన ముగ్గురు యువకులు వీరిని పలకరించారు. ఒకరినొకరు వాగ్వాదానికి దిగారు. 11 మంది యువకులకు, మద్యం సేవిస్తున్న ముగ్గురు యువకులకు మధ్య ఘర్షణ తీవ్రస్థాయిలో జరిగింది. ముగ్గురు యువకులను చితకబాదడమేగాకుండా, కారు అద్దాలను పగులగొట్టారు. దాడి చేసిన వారు చలమారెడ్డిపల్లె ఊరిలోకి వచ్చేలోపు బాధితులు తమ వారికి సమాచారం ఇచ్చారు. చలమారెడ్డిపల్లె గ్రామస్తులలో కొందరు 11 మందిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఒకరిద్దరు దొరకడంతో వారిని కొట్టి కట్టేశారు. సమాచారం తెలుసుకున్న రిమ్స్ పోలీసు అధికారులు, తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ఆదివారం రాత్రి పొద్దుపోయేదాకా విచారిస్తున్నట్లు సమాచారం.

అన్నదానం పుణ్యకార్యం


అన్నదానం చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్‌: అన్నదానం పుణ్యకార్యమని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. ఆదివారం కడప నగరంలోని 30వ డివిజన్‌లో రహమతుల్లా, ఫారూఖ్ ఆధ్వర్యంలో బార్బీ అన్నదాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా అన్నదానం చేయడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుభాన్ భాషా, కార్పొరేటర్ మహమ్మద్ షఫీ, నార్త్ జోన్ అధ్యక్షులు బిహెచ్ ఇలియాస్,జిల్లా కార్యదర్శి రమేష్ రెడ్డి, నాయకులు రహీం, బాబు భాయ్, సలీం సాహెబ్, అలీమ్, నూరుల్లా, షరీఫ్, బన్ను తదితరులు ఉన్నారు.

శిల్పారామంలో సందడి

కడప సెవెన్‌రోడ్స్‌: కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు, చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. పద్మాకర్ సహకారంతో కడపకు చెందిన కిశోర్ డ్యాన్స్ బృందం పల్లె జానపదాలు, శాస్త్రీయ నృత్యాలు, సినీ నృత్యాలతో హోరెత్తించారు.వారి నృత్యాలకు సందర్శకుల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమాలను శిల్పారామం పాలనాధికారి కృష్ణప్రసాద్, ఫీల్డ్ సూపర్‌వైజర్ మధుసూదన్‌బాబులు పర్యవేక్షించారు.

ఆచార్య కృష్ణారావుకు సత్కారం


కృష్ణారావును సన్మానిస్తున్న వైవీయూ పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి

కడప ఎడ్యుకేషన్‌: తన కష్టాన్ని నమ్ముకొని నిరంతరం శ్రమించి విశ్వవిద్యాలయ ఆచార్య స్థాయి అందుకొన్న కే ఎస్ వి కృష్ణారావు అభినందనీయుడని యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్న సందర్భంగా వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం వేమన నగర్ రచయితల సంఘం కార్యాలయంలో కృష్ణారావును సత్కరించారు.కార్యక్రమంలో రచయితల సంఘం కార్యవర్గం సభ్యులు 'మధురకవి'వెల్లాల వెంకటేశ్వరాచారి, ఉపాధ్యాయులు సుగూరు విశ్వనాథం,వల్లెపు నాగరాజు, తప్పెట కొండారెడ్డి, మల్లెబోయిన వెంకటేశ్వర్లు, సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.





నేడు అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవం



వేంపల్లి: ఫిజియోథెరపీకి సుదీర్ఘ చరిత్ర ఉంది. అయితే ఆధునిక రూపం మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత పుట్టింది. అప్పుడు గాయాలైన సైనికులను పునరావాసం కల్పించడానికి, వారి కదలికలను పునరుద్ధరించడానికి 'ఫిజికల్ థెరపీ' లేదా 'జిమ్నాస్టిక్స్' అని పిలిచే వ్యాయామాలు ఉపయోగించారు. తర్వాత 'ఫిజియోథెరపీ'అనే పేరు స్థిరపడింది.

పురాతన కాలం నుంచి ప్రారంభం

గాయం, వ్యాధుల కారణంగా కదలికలు కోల్పోయిన వారికి శారీరక వ్యాయామాల ద్వారా సహాయం చేసే పద్ధతి చాలా కాలం క్రితం నుంచి ఉంది. ప్రాచీన నాగరికతలో కూడా కదలికలను మెరుగుపరచడానికి వ్యాయామాలను ఉపయోగించినట్లు ఆధారాలు ఉన్నాయి.

ఫిజియోథెరపీ రంగం అభివృద్ధి

అమెరికాలో 1917లో 'ఫిజికల్ థెరపిస్ట్‌ల'కు ఒక సంస్థ స్థాపించబడింది. అనేకమంది పరిశోధకులు, వైద్య నిపుణుల కృషి వల్ల ఫిజియోథెరపీ రంగం బాగా అభివృద్ధి చెందింది. ఇటీవలి కాలంలో, ఫిజియోథెరపీ ప్రపంచంలోని మూడవ అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ వృత్తిగా మారింది. పులివెందులలో బాలాజీ ఫిజియోథెరపీ క్లినిక్, లైఫ్ కేర్ ఫిజియో క్లినిక్,సుధీర్ అడ్వాన్స్ డ్ ఫిజియోథెరపీ క్లినిక్, రిలీవ్ ఫిజియోథెరపీ, రిహాబిలిటేషన్ క్లినిక్ వేంపల్లిలో శ్రీ హరి ఫిజియోథెరపి క్లినిక్, రిహాబిలిటేషన్ సెంటర్ ఇంకా కొన్ని క్లినిక్‌లు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి.